క్లుప్తంగా

ప్రశాంతంగా మొదటి సెమిస్టర్ పరీక్షలు

పరకాల: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. బుధవారం 275 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 44 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని అబ్జర్వర్ డాక్టర్ పుల్లా రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్ పర్యవేక్షించారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

పరకాల: పట్టణంలోని భూపాలపల్లి రోడ్డులోని పోచమ్మగుడి సమీపంలోని ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి నుంచి పరకాల వైపు వస్తున్న కారు వెనుక నుంచి స్కూటీని ఢీకొంది. ఈ ఘటనలో పరకాలకు చెందిన బాసాని మల్లయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కారు ఆపకుండా వెళ్లడంతో స్థానికులు వెంటాడి పశువుల సంత వద్ద పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

గండ్ర దంపతుల సహకారంతో అభివృద్ధి



శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి తెలిపారు. మండలంలోని పత్తిపాక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనానికి స్లాబ్ నిర్మాణ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. సీసీరోడ్ల నిర్మాణం, సైడ్ కాల్వల నిర్మాణం, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ



ఎల్కతుర్తి : భారతీయ జనతా పార్టీ యువ మోర్చా(బీజేవైఎం) మండల ప్రధాన కార్యదర్శిగా ఎల్కతుర్తికి చెందిన అంచనగిరి వెంకటరమణను నియమిస్తూ బుధవారం బీజేవైఎం మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఉత్తర్వులు అందజేశారు. వెంకటరమణ మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి



నడికూడ : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని తహసీల్దార్ వీరగంటి మహేందర్ అన్నారు. బుధవారం మండలం కేంద్రంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ముందస్తుగా మహిళా దినోత్సవం వేడుకలను పురస్కరించుకొని మహిళలను శాలువతో సత్కరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ మహిళ సాధికారత కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. సమాజంలో మహిళ సమానత్వం కోసం పాటుపడే వ్యవస్థలను నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఊర రవీందర్‌రావు, సర్వోదయ ప్రతినిధులు, ఫీల్డ్ ఆఫీసర్లు, అంగన్‌వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు : స్థానిక సీఐగా బి.కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన గణేష్ వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సీఐ కుమార్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

విక్రమ్‌కు సైంటిస్టు అవార్డు



హన్మకొండ: హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల డీన్ ఫర్ సైన్స్ డాక్టర్ జి.విక్రమ్‌కు పాండిచ్చేరి యూనివర్సిటీ యంగ్ సైంటిస్టు అవార్డును ప్రకటించింది. సొసైటీ ఫర్ ప్లాంట్ రీసెర్చ్, అండ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయో ఇన్ఫర్మేటిక్స్, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ పాండిచ్చేరి యూనివర్సిటీ ప్లాంట్ మాలిక్యులర్ బయాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్‌పై నిర్వహించిన అంతర్జాతీయ సెమినార్‌లో డాక్టర్ జి.విక్రమ్ రిజిస్టర్ చేసిన పరిశోధనకు అవార్డు ఇచ్చారు.

కూలీలకు నీడ సౌకర్యం కల్పించాలి

● అడిషనల్ డీఆర్‌డీఓ రవి



నర్సరీని పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్డీఓ రవి

కమలాపూర్ : ఉపాధి హామీ పనులు జరుగుతున్న పని ప్రదేశాల వద్ద కూలీలకు తప్పనిసరిగా నీడ సౌకర్యం కల్పించాలని, ప్రథమ చికిత్స సామగ్రి అందుబాటులో ఉంచాలని అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవి ఆదేశించారు. మండలంలోని కమలాపూర్, అంబాల గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన చెరువు, ఎస్సారెస్పీ కాలువ పూడికతీత పనులను, నర్సరీలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులకు వచ్చే కూలీలు ఐదు లీటర్ల తాగునీరు వెంట తెచ్చుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కూలీలు విధిగా తమ వెంట జాబ్ కార్డులు తెచ్చుకోవాలని, రోజుకు రూ.257 కూలి గిట్టుబాటయ్యేలా పని చేయాలని సూచించారు. ప్రతి పని ప్రదేశంలో ఆ పనికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఫైల్ రూపంలో టీఏలు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం ఎఫ్ఏలు తమ మొబైల్ నుంచి తప్పనిసరిగా కూలీల హాజరు పంపించాలని ఆదేశించారు.

వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

గ్రామాల్లో నూటికి నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీఓ పల్లవి ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులు, నర్సరీల నిర్వహణ, ఇంటి పన్నుల వసూలు, ఉన్నతి అనే అంశాలపై ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో శుక్రవారం జరిగే శిక్షణ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి ఐదుగురు హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రతి గ్రామంలో రోజుకు 100 మంది కూలీలకు పని కల్పించాలని, నర్సరీల్లో షెడ్ నెట్లు ఏర్పాటు చేసి తప్పనిసరిగా ప్రతి బ్యాగులో ఒక మొక్క ఉండేలా చూడాలన్నారు. ఎంపీఓ విమల, జేడీఎం శ్రీనివాస్, ఏపీఓ రమేష్, ఈసీ కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షాన సీపీఐ పోరాటం

భీమదేవరపల్లి : కేంద్ర ప్రభుత్వం రైతాంగంపై నిర్లక్ష్యం వహిస్తుందని సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ ఆరోపించారు. త్వరలోనే సీపీఐ ఆధ్వర్యంలో రైతుల పక్షాన పోరాటం చేయనున్నట్లు ఆమె తెలిపింది. బుధవారం కొత్తపల్లిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేసింది. కేంద్రం వ్యవసాయానికి గతంలో కంటె బడ్జెట్ తగ్గించడంపై ప్రభుత్వ వైఖరి బయటపడిందన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. రైతుల కోసం త్వరలోనే కేంద్ర ప్రభుత్వంపై దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న పద్మ

కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగల రాంచంద్రారెడ్డి, అరుణ, మంచాల రమ, మంచాల తిరుపతి, మార్పు కృష్ణారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

సబ్‌కోర్టు కావాలని కేసీఆర్‌ను కోరుతా



సబ్‌కోర్టు కోసం ఎమ్మెల్యేకు విన్నవించుకుంటున్న న్యాయవాదులు

పరకాల: రెవెన్యూ డివిజన్ కేంద్రంగా అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటున్న పరకాల పట్టణంలో సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలనే న్యాయవాదుల కోరికను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి మంజూరు కోసం కృషిచేస్తానని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హామీ ఇచ్చారు. పరకాల అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు శ్రీనివాస్ నేతృత్వంలో న్యాయవాదులంతా ఎమ్మెల్యేను హన్మకొండలోని ఆయన నివాసంలో బుధవారం కలిసి సబ్‌కోర్టు కోసం వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కక్షిదారులకు సౌకర్యంగా ఉండేలా సబ్‌కోర్టు ఏర్పాటుకు కృషిచేస్తానని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకుడు సోదా రామకృష్ణతో పాటు సీనియర్ న్యాయవాదులు పున్నం రాజిరెడ్డి, గట్ల విజయపాల్‌రెడ్డి, ఒంటేరు రాజమౌళి, పి.వెంకటరమణ, గండ్ర నరేష్‌రెడ్డి, జి.రాజేందర్, మచ్చ మహేందర్, శ్రావణ్‌కుమార్, పి.వేణు, లక్కం శంకర్, రాహుల్, విక్రమ్ తదితరులు ఉన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

● పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

దామెర: ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని ఊరుగొండకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నల్ల భిక్షపతి ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బీఆర్ఎస్ భీమా కింద రూ.2 లక్షలు మంజూరు కాగా పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి భిక్షపతి కుటుంబ సభ్యులకు బుధవారం చెక్కును ఆయన నివాసంలో అందజేశాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే కార్యకర్తల సంక్షేమం కోసం దేశంలో ఎక్కడా లేనివిధంగా బీమా సౌకర్యం కల్పించి ఆర్థికసాయం అందజేస్తున్నామని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని వెల్లడించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, మాజీ ఎంపీపీ జన్ను మల్లయ్య, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ దాడి మల్లయ్య, మాజీ సర్పంచ్ దామెరుప్పుల శంకర్, నాయకులు వక్కల రమేష్, నల్ల మహేష్ ఉన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



శాయంపేట : మండలంలోని వసంతపూర్‌కు చెందిన ఇటుకాల రాజేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, నాయకులు పోతు రమణారెడ్డి, తోకల సమ్మిరెడ్డి, గౌస్, రమేష్, బేర్గు రాకేష్, కొత్తగట్టు సాయి పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి పాదయాత్రను విజయవంతం చేయాలి

దామెర: రేవంత్ రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి బుధవారం పిలుపునిచ్చారు. మండలంలోని ఊరుగొండలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పేర్కొన్నారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మన్నెం ప్రకాష్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పోలెపాక శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రజినీకర్‌రెడ్డి, ఆసోద రాజయ్య, మండల ప్రధాన కార్యదర్శులు శనిగరం సుధాకర్, భిక్షపతి, ఉపసర్పంచ్‌లు ఎన్‌రెడ్డి కరుణాకర్ రెడ్డి, మధు, ప్యాక్స్ డైరెక్టర్ రాజు, శ్రీధర్ రెడ్డి, రాజేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇనగాల

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



దామెర :శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శంకర్

దామెర : కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. మండలంలోని కోగిల్వాయిలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులందరూ సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వర్‌రావు, మండల వైద్యాధికారి డాక్టర్ మంజుల, డాక్టర్ వనజ, ఎంపీటీసీ సంగరబోయిన మౌనిక, ఉపసర్పంచ్ గోల్కొండ సాంబయ్య, హెచ్ఈఓ అశోక్ బాబు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కంటి వెలుగు కార్యక్రమం

పరకాల: పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పరకాల మున్సిపల్ కమీషనర్ టి.శేషాంజన్‌స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస కాలనీలో గల చేనేత భవనంలో గురువారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



ఆత్మకూరు : మండలంలోని అక్కంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆర్యవైశ్య పోరాట సమితి నాయకుడు నూనె రాజయ్య 10వ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలు, మిగతా విద్యార్థులకు డిక్షనరీలు, పెన్నులు, స్టేషనరీ సామాగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొడుమూరి రమేష్, మధుకర్, ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీధర్, ఎస్ఎంసీ చైర్మన్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణానికి రండి



ఆహ్వానపత్రికను అందజేస్తున్న కమిటీ సభ్యులు

దామెర: మండలంలోని ఊరుగొండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 16న నిర్వహించనున్న శివపార్వతుల కల్యాణానికి హాజరుకావాలని సర్పంచ్ గోగుల సత్యనారాయణ రెడ్డి, కమిటీ సభ్యుడు సునీల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రవీందర్, ఆలయ అర్చకులు వచ్చునూరు శ్రవణ్‌కుమార్‌లు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా 16న కల్యాణం, 17న అభిషేకం, అర్చనలు, 18న శివరాత్రిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ బ్రహ్మోత్సవాలకు తప్పకుండా హాజరవుతానని తెలిపారు.

శిక్షణకు కాకినాడకు తరలిన మత్స్యకారులు

శాయంపేట: నాబార్డు సహకారంతో సహాయ సోషల్ సర్వీస్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో మత్స్యకారులు శిక్షణ తరగతుల కోసం కాకినాడకు వెళ్లారు. మండలంలోని గట్లకనిపర్తి, కొత్తగట్టు సింగారం, గోవిందాపూర్, కొప్పుల, శాయంపేట గ్రామాలకు చెందిన 25 మంది మత్స్యకారులు చేపల పెంపకంలో మెళకువలు నేర్చుకునేందుకు ఏపీలోని కాకినాడ సీఐఎఫ్ఈలో శిక్షణ తరగతులకు తరలివెళ్లారు. కార్యక్రమానికి జిల్లా మత్స్యశాఖ అధికారి విజయభారతి జెండా ఊపి పంపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మత్స్యకారులు చేపల పెంపకంలో మెళకువలు పాటిస్తూ ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో మత్స్యకారులు శ్రీను, సదానందం, బుచ్చిబాబు, రామన్న, రవీందర్, నర్సరాజు తదితరులు పాల్గొన్నారు.



కాకినాడకు తరలివెళ్తున్న మత్స్యకారులు

‘ఆయుష్మాన్’ను అడ్డుకుంటున్న తెలంగాణ సర్కార్



పరకాల : మాట్లాడుతున్న విజయచందర్‌రెడ్డి

పరకాల: పేద ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆయుష్మాన్ భారత్ పథకంతో 1200 రకాల జబ్బులను నయం చేసుకోవచ్చని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి అన్నారు. ఈ పథకాన్ని తెలంగాణలో అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆరోపించారు. మండలంలోని పోచారంలో ప్రజాగోస..బీజేపీ భరోసా నినాదంతో ఏర్పాటు చేసిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి గ్రామశక్తి కేంద్ర ఇన్‌చార్జ్ కొయ్యడ రమేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా డాక్టర్ విజయచందర్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. దేశంలో ప్రస్తుతం 19 రాష్ట్రాల్లో బీజేపీ పరిపాలనపై ప్రజలు ఎంతో గౌరవం చూపిస్తున్నారన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు పుట్ట రవీందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జ సత్యానారాయణ, జిల్లా కార్యదర్శి ఎర్రం రామన్న, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీలత పాల్గొన్నారు. పట్టణంలోని 36,37 బూత్‌ల పరిధిలోని మాదారం కాలనీలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ సంఘం పురుషోత్తం అధ్యక్షతన జరిగిన స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ ఆలేరు పాలక్, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, కొత్తగూడెం ప్రభారి దేవునూరి మేఘనాథ్, రాజభద్రయ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

దేశకీర్తిని విశ్వవ్యాప్తం చేస్తున్న మోదీ

ఆత్మకూరు : ప్రధాని నరేంద్రమోదీ భారత దేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేస్తున్నారని బీజేపీ హుస్నాబాద్ పాలక్ డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ అన్నారు. మండలంలోని గుడెప్పాడ్‌లో బూత్ కమిటీ ఆధ్వర్యంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ బీజేవైఎం మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్‌రెడ్డి అధ్యక్షతన ప్రజాగోస-బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ సమావేశం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇర్సడ్ల సదా నందం, ఉప్పుగళ్ల శ్రీకాంత్‌రెడ్డి, ఆర్‌టీఐ కన్వీనర్ ఎదులపురం శ్రవణ్‌కుమార్, గుడెప్పాడ్ బూత్ అధ్యక్షుడు నాగపురి నాగబాబు, ఓబీసీ మండల అధ్యక్షులు వెల్దే సదానందం, సోషల్ మీడియా కన్వీనర్ బలభద్ర దినేష్, పాల్గొన్నారు.

ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

ఐనవోలు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ మురళీధర్‌గౌడ్ అన్నారు. ప్రజాగోస-బీజేపీ భరోసా శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్‌లో భాగంగా బుధవారం మండలంలోని నందనం, రెడ్డిపాలెం పరిధిలోని 176, 177, 178, 179 బూత్‌ల శక్తికేంద్రం ఇన్‌చార్జ్ ముంజ వెంకన్న ఆధ్వర్యంలో సమావేశం నందనంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మురళీధర్‌గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు అడ్డగట్ల రాజేంద్రప్రసాద్, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ యుగేందర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు రమేష్, అనిల్‌కుమార్, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌లు, పాల్గొన్నారు.



ఆత్మకూరు : మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

మల్లన్న ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం మొదలుకుని 20వ తేదీ సోమవారం వరకు ఐదు రోజుల పాటు జరగనున్నాయి. ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో పాంచాహ్నిక దీక్షతో త్రికుండాత్మకంగా శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాలు శైవ ఆగమోక్తంగా అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

బ్రహ్మోత్సవాల షెడ్యూల్

- 16న ఉదయం 8 గంటలకు సూర్య ప్రభ వాహన సేవ, యాగశాల ప్రవేశం, దీక్షాధారణ, అఖండ దీప స్థాపన, అస్త్రరాజార్చన, బలిహరణ, సాయంత్రం మృత్ సంగ్రహణ, అంకురార్పణ, అగ్ని మదన-అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ బలిహరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి చంద్ర ప్రభ వాహనసేవ జరగనుంది.
- 17న ఉదయం అశ్వ వాహనసేవ, రాత్రి శేష వాహన సేవ తోపాటు గవ్యాంత పూజలు, వాస్తు పూజ, పర్యగ్నికరణ రుద్ర హోమం, ప్రాతరౌపాసన, అష్టోత్తర శత కళశార్చన, మహాన్యాసరుద్రం లాంటి కార్యక్రమాలు ఉంటాయి.
- 18న మహాశివరాత్రి ఉదయం సింహ వాహన సేవ రాత్రి నంది వాహనసేవతో పాటు లింగోధ్భవ కాలంలో అష్టోత్తర శత(108) కలశాల తోవిశేష మహాభిషేకం,
- 19న ఉదయం రావణ వాహన సేవ, సాయంత్రం రథోత్సవం పురవీధి సేవ, రథాంగ హోమం జరుగుతాయి.
- 20న ఉదయం పర్వతవాహన సేవ, గవ్యాంత పూజలు, రుద్ర, చండి హోమం, మృగయాత్ర, ధ్వజ అవరోహణ, నిత్యోపాసన, బలిహరణ, పూర్ణాహుతి, చూర్ణోత్సవం, వసంతోత్సవం, త్రిశూల స్నానం, అవబృదుతో పాటు రాత్రికి పవళింపు సేవ, పుష్పోత్సవం, ఏకాంత సేవ, పండిత ఆశీర్వచనం, పండిత సన్మానాది కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. వాహన సేవలలో పాల్గొనే వారు దేవస్థాన కార్యాలయంలో రూ.516 చెల్లించి రశీదు పొందాలని ఈఓ అద్దంకి నాగేశ్వర్ రావు తెలిపారు. శివరాత్రి ఉత్సవాల ఐదు రోజులు దాతల సహకారంతో మహా అన్నదానం జరుగుతుందని చెప్పారు.



విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

ఎల్కతుర్తి: కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బయ్యారం నుంచి హైద్రాబాద్ వరకు 700 కిలోమీటర్లు నెలరోజుల పాటు సీపీఐ నిర్వహించే పాదయాత్ర సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో సీపీఐ నాయకులు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి రాములు మాట్లాడుతూ తెలంగాణకు ఇచ్చిన హామీలు బయ్యారం ఉక్కుపరిశ్రమ, కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన యూనివర్సిటీ, ప్రభుత్వ స్థలాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేయొద్దని నిర్వహించే పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్రె లక్ష్మణ్, మొండయ్య, నిమ్మల మనోహర్, గడ్డం లలిత, విజయ్. భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మొగిళి తదితరులు పాల్గొన్నారు.

అవయవదానానికి ముందుకు రావాలి

● నేత్ర, అవయవ, శరీరదాతల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి



అభినందన పత్రాన్ని అందిస్తున్న పెండ్లి ఉపేందర్‌రెడ్డి

భీమదేవరపల్లి: ప్రతి ఒక్కరూ అవయవదానానికి ముందుకు రావాలని తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్ రెడ్డి కోరారు. మండలంలోని కొత్తపల్లికి చెందిన వంగ రాజమ్మ ఇటీవల మరణించిగా ఆమె దేహాన్ని అల్లుడు కొంగల రాంచంద్రారెడ్డి కేఎంసీకి పరిశోధనల నిమిత్తం అప్పగించాడు. ఈ సందర్భంగా రాజమ్మ సంతాప సభ బుధవారం జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన పెండ్లి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ మరణ అనంతరం దేహాన్ని కాల్చడం, పూడ్చడం కాకుండా దానం చేయడం ద్వారా పరిశోధనలకు ఉపయోగపడుతుందని, ఇక ఇతర అవయవాలు సైతం అవసరం ఉన్న వారికి పునర్జన్మనిస్తాయన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో తమ అసోసియేషన్ ద్వారా 200మంది మరణానంతరం తమ దేహాన్ని పరిశోధనలకు ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలిపారు. ఇక 500 మంది వారి మరణ అనంతరం నేత్రాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఇందులో అత్యధికంగా ఉమ్మడి వరంగల్ జిల్లావాసులే అధికంగా ఉన్నట్లు వివరించారు. జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కావేటి శంకర్‌రావు యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొంగల రాంచంద్రారెడ్డి, బూర రాం మోహన్, రిటైర్డ్ డీఎస్పీ రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ బొజ్జపురి అశోక్‌ముఖర్జీ, సీపీఐ మండల కార్యదర్శి ఆదరి శ్రీనివాస్ తదితరులున్నారు. ఈ సందర్భంగా అవయవదాతలకు అభినందన పత్రాన్ని అందించారు.

భార్యాభర్తలు సైతం శరీరదానానికి ఒప్పందం

కాగా కొత్తపల్లిలో కొంగల రాంచంద్రారెడ్డి, అతని భార్య లక్ష్మి కూడ మరణానంతరం శరీర దానానికి గత నాలుగేళ్ల క్రితమే అంగీకరించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు.